నగరపాలక సంస్థలో బదిలీలలు

- ముడుపులు ఇచ్చుకో... నచ్చిన వార్డులు పుచ్చుకో!
- సీనియర్ మేస్త్రీలను కాదని జూనియర్ మేస్త్రీలకు వార్డుల కేటాయింపు
- కౌన్సెలింగ్ లేకుండా అంతర్గత బదిలీలు చేపట్టేందుకు చర్యలు
- రెండు రోజుల్లో బదిలీలు చేపడుతున్న ప్రజారోగ్యధికారులు
- చక్రం తిప్పుతున్న ఓ కీలక అధికారి



నగరపాలక సంస్థ కార్యాలయం

నెహ్రూనగర్: గుంటూరు నగరపాలక సంస్థ ప్రజారోగ్య విభాగంలో అంతర్గత బదిలీలకు రంగం సిద్ధమైంది. అయితే, ఇవి పారదర్శకంగా జరగడం లేదనే తెలుస్తుంది. మరో రెండు రోజుల్లో జరిగే ఈ బదిలీల్లో ముడుపులు ఇచ్చిన వారికి కావాల్సిన వార్డుల్లో పోస్టింగ్ ఇచ్చేందుకు రంగం సిద్ధం చేశారు. ముడుపులు ఇచ్చుకోలేని సీనియర్ మేస్త్రీలు ఈ పోస్టింగ్ వ్యవహారంపై పెదవి విరుస్తున్నారు.

కమిషనర్‌ను తప్పుదోవ పట్టించి పోస్టింగ్‌లు

గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో 23 శానిటరీ డివిజన్లు ఉన్నాయి. వీటిలో 10 మంది రెగ్యులర్ ఇన్‌స్పెక్టర్లు. మిగిలిన 13 డివిజన్లల్లో హెల్త్ అసిస్టెంట్లు ఇద్దరు, శానిటరీ మేస్త్రీలు, సచివాలయ సెక్రటరీలు విధులు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం ప్రజారోగ్య శాఖలో ఇన్‌స్పెక్టర్ల బదిలీల వ్యవహారం తెరమీదకు వచ్చింది. ఆ శాఖలోని ముఖ్య అధికారి సీనియార్టీ కౌన్సెలింగ్ కాదని...ముడుపులు ఇచ్చిన వారికి తమకు నచ్చిన వార్డుల్లో శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా పోస్టింగ్ ఇచ్చేందుకు పావులు కదుపుతున్నారు. గతంలో ఇదే విధంగా కౌన్సిలింగ్ లేకుండా బదిలీలు చేపట్టడంతో అప్పటి కమిషనర్ అనురాధ విషయం తెలుసుకుని సదరు ఆర్డర్ రద్దు చేశారు. సీనియార్టీ ప్రకారం కౌన్సెలింగ్ నిర్వహించి పోస్టింగ్ ఇచ్చారు.

కాని ఇప్పుడు ఆ సీనియార్టీ కాదని..కమిషనర్‌ను తప్పుదోవ పట్టించి పోస్టింగ్‌లు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నారని ఆ శాఖలోని పలువురు బహిరంగంగా చర్చించుకోవడం గమనర్హం.

చేతులు మారుతున్న లక్షల రూపాయలు

శానిటరీ ఇన్‌స్పెక్టర్ల బదిలీల్లో లక్షలాది రూపాయలు చేతులు మారుతున్నట్లు సమాచారం. ఇప్పటికే పలువురు తమకు నచ్చిన వార్డుల్లో పోస్టింగ్ ఇచ్చేందుకు ఆ శాఖల అధికారులకు భారీగా సమర్పించుకున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. 20 ఏళ్ల పైబడి సీనియర్ మేస్త్రీలుగా విధులు నిర్వహిస్తున్న వారిని కాదని...కొత్తగా విధుల్లో చేరిన వారికి పోస్టింగ్‌లు ఇస్తున్నారని సమాచారం. రెండు రోజుల్లో పూర్తి స్థాయిలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ల మార్పుల ఉన్న నేపథ్యంలో దీనిపై నగర కమిషనర్ ఏ విధంగా స్పందిస్తారో వేచి చూడాలి. సీనియార్టీ ప్రకారం కౌన్సెలింగ్ నిర్వహించి అర్హులైన వారికి వార్డులు కేటాయించాలని సీనియర్ మేస్త్రీలు కోరుతున్నారు.

జీజీహెచ్ అభివృద్ధికి కృషి

ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ పర్యటన



జీజీహెచ్‌లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే నసీర్ అహ్మద్, పక్కన డాక్టర్ యశస్వి రమణ తదితరులు

గుంటూరు మెడికల్: జీజీహెచ్ అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అహ్మద్ తెలిపారు. జీజీహెచ్‌లో గురువారం తనిఖీలు చేశారు. రోగులకు అందిస్తున్న సౌకర్యాలు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ఐదేళ్లలో జీజీహెచ్ పూర్తిగా గాడి తప్పిందని, రోగులకు వైద్యం అందించే విషయంలో నిర్లక్ష్యం కనిపించిందని తెలిపారు. రోగులకు ఇచ్చే ఆహారంలో నాణ్యత పాటించాలని చెప్పారు. వైద్యులు సమయపాలన పాటిస్తూ రోగులకు కార్పొరేట్ స్థాయిలో వైద్యం అందించాలని సూచించారు. జీజీహెచ్‌లో ఆగిపోయిన క్యాంటీన్‌ను తిరిగి అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. ఆసుపత్రిలో ట్రాఫిక్ సమస్య నియంత్రణకు యాక్షన్ ప్లాన్ రూపొందించి అమలు చేయాలని, కమర్షియల్ క్యాంటీన్ పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఆసుపత్రిలో వంద పడకలతో ట్రామా కేర్ ఐసీయూ ఏర్పాటు చేసేందుకు కావాల్సిన ప్రణాళికలు సిద్ధం చేయాలని సూపరింటెండెంట్ డాక్టర్ యశస్వి రమణకు తెలిపారు. ఆయన వెంట సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ బత్తుల వెంకటసతీష్‌కుమార్, డాక్టర్ జ్యోతుల మురళి, అసిస్టెంట్ డైరెక్టర్ చింతలపూడి నాగేశ్వరరావు, కార్పొరేటర్ పోతురాజు సమత, వైద్యులు, వైద్య సిబ్బంది ఉన్నారు.

విద్యార్థుల్లో సేవా దృక్పథాన్ని పెంపొందించేందుకు కృషి



వృద్ధులకు దుప్పట్లు అందజేస్తున్న చిన్నారులు

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థులకు చిన్నతనం నుంచే సేవా దృక్పథాన్ని పెంపొందించడానికి భాష్యం విద్యాసంస్థలు కృషి చేస్తున్నాయని భాష్యం బ్లూమ్స్ జెడ్ఈవో వరలక్ష్మి పేర్కొన్నారు. చంద్రమౌళీనగర్‌లోని భాష్యం టాడ్లర్స్‌లో గురువారం చిన్నారులకు థాంక్స్ గివింగ్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా తమకు ప్రతిరోజూ సేవలందిస్తున్న ఉపాధ్యాయేతర సిబ్బందికి ఆహార పదార్థాలను అందజేసి కృతజ్ఞతలు తెలియజేశారు. తోటి విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనాలు చేశారు. నిరాశ్రయులైన వృద్ధులు, అనాథలకు పండ్లు, దుప్పట్లు, ఆహారాన్ని పంపిణీ చేశారు. కార్యక్రమాన్ని పాఠశాల ప్రిన్సిపాల్ కవిత పర్యవేక్షించారు.

క్లుప్తంగా

రోడ్లు, డ్రెయిన్లపై ఆక్రమణలు తొలగించాలి

నెహ్రూనగర్: నగరంలో డిసెంబర్ 10వ తేదీకి వెండింగ్ జోన్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. వార్డ్ సచివాలయ కార్యదర్శులు సమష్టిగా తమ సచివాలయ పరిధిలో రోడ్లు, డ్రెయిన్ల మీద ఆక్రమణలు తొలగించాలని ఆయన ఆదేశించారు. ఆయన గురువారం నగరపాలక సంస్థ కమిషనర్ చాంబర్‌లో లాలాపేట, పట్నంబజార్ వార్డ్ సచివాలయ కార్యదర్శులతో ఆక్రమణల తొలగింపుపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నగరంలో పెరుగుతున్న ట్రాఫిక్, డ్రెయిన్ల మీద ఆక్రమణల వల్ల పూడిక తీయడటానికి వీల్లేకుండా ఉందని తెలిపారు. మురుగుపారుదలకు ఆటంకంగా ఉండడం వల్ల అనేక సమస్యలు ఎదురవుతున్నాయని చెప్పారు. ఇప్పటికే దశల వారీగా నగరంలోని పలు ప్రాంతాల్లో ఆక్రమణల తొలగింపు చేపట్టామని వివరించారు. డిసెంబర్ 10 నాటికి గుర్తించిన ప్రాంతాల్లో వెండింగ్ జోన్లు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని, ఆక్రమణలు తొలగించిన ప్రాంతాల్లో తిరిగి ఏర్పాటు చేయకుండా సచివాలయ కార్యదర్శులు సమష్టిగా చర్యలు తీసుకోవాలని ఆయన తెలిపారు. క్షేత్రస్థాయిలో సమస్యలు ఎదురైతే తక్షణం తమ దృష్టికి తీసుకురావాలని, అవసరమైతే పోలీసుల సహకారం తీసుకోవాలని సూచించారు. విధుల్లో నిర్లక్ష్యంగా ఉంటే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు.

వివాహిత ఆత్మహత్య

లక్ష్మీపురం: అనారోగ్యంతో మానసిక ఒత్తిడికి లోనై వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన బుధవారం సాయంత్రం చోటు చేసుకుంది. అరండల్‌పేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భారత్ పేట 4/2వ లైన్ ప్రాంతానికి చెందిన శ్రావణి (28), చెన్నారెడ్డికి 12 సంవత్సరాలు క్రితం వివాహమైంది. చెన్నారెడ్డి ఎకై స్లజ్ విభాగం ల్యాబ్‌లో పని చేస్తారు. పాప, బాబు ఉన్నారు. అయితే, కొంత కాలంగా శ్రావణి అనారోగ్య కారణంగా ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. కుటుంబ సభ్యులకు భారం అవుతున్నానని చెబుతూ బాధపడేది. ఈ నేపథ్యంలో బుధవారం సాయంత్రం ఇంట్లో ఎవరు లేని సమయంలో గదిలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహ్యాత చేసుకుంది. గమనించిన కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించగా వైద్యులు మృతి చెందినట్లు ధ్రువీకరించారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని ప్రభుత్వ సమగ్రాసుపత్రికి పోస్‌మార్టం నిమిత్తం పంపారు. భర్త చెన్నారెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేశారు.

రైల్వే ఉద్యోగాలు పేరిట మోసం : కేసు నమోదు

రైల్వే శాఖలో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ గుంటూరు పట్టాభిపురంలోని డీఆర్ఎం కార్యాలయానికి తీసుకు వెళ్లి నకిలీ ఆర్డర్ కాగితాలు ఇచ్చి అన్నాచెల్లి వద్ద రూ.7.50 లక్షలు తీసుకుని మోసం చేసిన ముగ్గురిపై అరండల్‌పేట పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. భారత్‌పేట 6వ లైన్, పోస్టల్ కాలనీ ప్రాంతానికి చెందిన మోదుగుల సుబ్బారావు ఓ ప్రైవేట్ స్కూల్‌లో తెలుగు ఉపాధ్యాయుడుగా విధులు నిర్వహిస్తుంటారు. 2020లో కైకవరపు రవీంద్ర, సుబ్బారావు, చిట్టెటి మెర్విన్ పరిచయం అయ్యారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగాలు ఇప్పిస్తానని నమ్మించారు. రైల్వేలో ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పడంతో తనతో పాటు సోదరికి కూడా ఉద్యోగం కావాలని సుబ్బారావు అడిగాడు. అయితే, ఇద్దరికి కలిపి రూ.7.50లక్షలు తీసుకుని సుబ్బారావును పట్టాభిపురంలోని డీఆర్ఎం కార్యాలయానికి తీసుకెళ్లారు. బయట నిలబెట్టి నకిలీ ఉద్యోగ అర్డర్ కాపీలు చేతి పెట్టారు. మరుసటి రోజు సుబ్బారావు రైల్వే కార్యాలయానికి వెళితే నకిలీ ఆర్డర్ కాపీలు ఇచ్చినట్లు తెలిసింది. దీనిపై సుబ్బారావు పై ముగ్గురుని నిలదీయగా అదిగో ఇదిగో అంటూ కాలయాపన చేస్తున్నారు. దీంతో దిక్కుతోచక సుబ్బారావు అరండల్‌పేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఓటు ప్రాధాన్యతను యువత గుర్తించాలి



పొన్నూరు: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు 2025 జనవరి 1వ తేదీకి 18 సంవత్సరాలు నిండిన వారు, ఇప్పటి వరకు ఓటు లేనివారు ఫారం- 6 ద్వారా తమ ఓటును నమోదు చేసుకోవాలని తహసీల్దార్ మహమ్మద్ జియావుల్‌హక్ తెలిపారు. పట్టణంలోని పీబీఎన్ కళాశాలలో స్వీప్(ఎన్నికల భాగస్వామ్యం) కార్యక్రమంపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఓటు ప్రాధాన్యత, ఎన్నికల్లో భాగస్వామ్యం, ప్రజాస్వామ్యంలో యువత ఆవశ్యకత, ఓటు ఎలా నమోదు చేసుకోవాలి అనే అంశాలపై వివరించారు. ఓటు ప్రాధాన్యతను యువత గుర్తించాలని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ముప్పాళ్ల రమేష్ బాబు, కళాశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


శాస్త్రవేత్తలను స్ఫూర్తిగా తీసుకోవాలి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ విద్యాధర

గుంటూరు ఎడ్యుకేషన్: ఔషధ పరిశోధనలు చేసిన గొప్ప శాస్త్రవేత్తలను విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకోవాలని చేబ్రోలు హనుమయ్య ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్. విద్యాధర పేర్కొన్నారు. అమరావతి రోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాలలో గురువారం 63వ జాతీయ ఫార్మసీ వారోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న విద్యాధర మాట్లాడుతూ గత మూడేళ్లుగా ఇండియన్ ఫార్మస్యూటికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో యాంటీ బయాటిక్ రెసిస్టెన్స్, క్షయ, క్యాన్సర్ వ్యాధి నియంత్రణ కోసం చేపట్టిన అవగాహన కార్యక్రమాలు, చర్యలను వివరించారు. కేంద్ర ఆరోగ్య శాఖ చేపట్టిన ఆయుష్మాన్ భారత్‌లో చేరే పద్ధతి, ఉపయోగాలను విద్యార్థులకు తెలియజేశారు. ఈసందర్భంగా హిందూ ఫార్మసీ కళాశాల నాక్ గుర్తింపు పొందిన సందర్భంగా అభినందనలు తెలియజేశారు. అనంతరం ఫార్మసీ వారోత్సవాల సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు, కరస్పాండెంట్ ఎస్. మధుసూదనరావు, ప్రిన్సిపాల్ ఎంవీ నాగభూషణం, వైస్ ప్రిన్సిపాల్స్ పి. సీతారామయ్య, ఏ. ప్రత్యూష, ఫార్మకాలజీ విభాగాధిపతి దేసు బ్రహ్మ శ్రీనివాసరావు, పి. నాగరాజు, అధ్యాపకులు పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు



వాహనాలను తనిఖీలు చేస్తున్న వెస్ట్ ట్రాఫిక్ సీఐ సింగయ్య

లక్ష్మీపురం: మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు తీవ్రంగా ఉంటాయని వెస్ట్ ట్రాఫిక్ సీఐ సీహెచ్.సింగయ్య తెలిపారు. స్థానిక కె.వి.పి కాలనీ వీఐపీ రోడ్డులో గురువారం రాత్రి డ్రంకన్ డ్రైవ్ నిర్వహించారు. వాహనాలను తనిఖీలు చేశారు. వాహనదారుల వద్ద రికార్డులను పరిశీలించారు. పలువురికి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఇంటి నుంచి బయటకు వచ్చిన వారు తిరిగి ఇంటికి క్షేమంగా వెళ్లే వరకు కుటుంబ సభ్యులు ఎంతో ఆందోళనగా ఉండాల్సిన దుస్థితి ప్రస్తుత రోజుల్లో ఏర్పడిందని తెలిపారు. ఇటీవల ప్రధానంగా యువత మద్యం, గంజాయి వంటి మత్తు పదార్థాలకు బానిసలు అయి వారి భవిష్యత్తును రోడ్డుపాలు చేసుకుంటున్నారని చెప్పారు. యువతకు వాహనాలు ఇచ్చే ముందుకు కుటుంబ సభ్యులు ఆలోచించాలని ఆయన సూచించారు. ప్రసుత్తం ద్విచక్రవాహనాలు 500 సీసీ వరకు వస్తున్నాయని, వీటితో బైక్ రేస్‌లంటూ ప్రమాదాలు కొని తెచ్చుకుంటున్నారని తెలిపారు. అండగా ఉండాల్సిన యువకులు ప్రాణాలు కోల్పోవడంతో కుటుంబాలు ఛిన్నాభిన్నం అవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. వాహనదారులు బయటకు వచ్చిన సమయంలో ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఆయన సూచించారు. ద్విచక్రవాహన దారులు అతి వేగంగా ప్రయాణించరాదని తెలిపారు. హెల్మెట్ ధరించాలని, వాహనానికి సంబంధించిన అన్ని రికార్డులను, ప్రధానంగా డ్రైవింగ్ లైసెన్స్‌లను కలిగి ఉండాలని ఆయన సూచించారు. అనంతరం మౌత్ ఎనలైజర్‌తో వాహనాలను నడిపే వారిని తనిఖీలు చేసి కేసులు బనాయించారు.

ఆధునిక జీవనశైలితోనే అనారోగ్య సమస్యలు



మాట్లాడుతున్న మురళీకృష్ణ

గుంటూరు ఎడ్యుకేషన్: ఆధునిక జీవనశైలితోనే అనారోగ్య సమస్యలు, వ్యాధులు ఉత్పన్నమవుతున్నాయని ఆరోగ్య భారతి జాతీయ సహా సంఘటన కార్యదర్శి డాక్టర్ మురళీకృష్ణ పేర్కొన్నారు. అమరావతి రోడ్డులోని హిందూ కాలేజీ ఆఫ్ మేనేజ్‌మెంటు ప్రాంగణంలోని సుధర్మ హాల్లో గురువారం ఆరోగ్య భారతి ఆధ్వర్యంలో ధన్వంతరి హోమం, ధన్వంతరి జయంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య వక్తగా పాల్గొన్న డాక్టర్ మురళీకృష్ణ మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో వివిధ వర్గాల ప్రజలు అనుభవిస్తున్న వ్యాధులు, రోగాలకు 80 శాతం ఆధునిక జీవనశైలి కారణమని తెలిపారు. శ్రమకు మించి తినడం సైతం ఆరోగ్యానికి చేటు తెస్తుందని చెప్పారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వి మాట్లాడుతూ ఆధునిక జీవనశైలిలో పోషక విలువలు గల ఆహారం తగ్గిపోవడం, సరైన వ్యాయామం లేకపోవడం వలన వ్యాధులు, దీర్ఘకాలిక రోగాల బారిన పడుతున్నారని తెలిపారు. సేవాభారతి రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కేఎస్ఎన్ చారి మాట్లాడుతూ సమతుల ఆహారం, వ్యాయామం, జీవనశైల్లో మార్పులతో ఆరోగ్యవంతులుగా ఉండవచ్చని సూచించారు. ప్రభుత్వ జ్వరాల ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.రఘు మాట్లాడుతూ శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యం చాలా ముఖ్యమైన తెలియజేశారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ వై.సుబ్బారాయుడు మాట్లాడుతూ ఆయుర్వేద వైద్యం సమగ్ర వైద్యం అని, ప్రస్తుత వైద్య విధానం ఉపశమనానికి మాత్రమే అని తెలియజేశారు. డాక్టర్ ఎండీవీ రమణ, డాక్టర్ డి.సత్యబాబు తదితరులు ప్రసంగించారు. కార్యక్రమంలో ప్రభుత్వ వైద్యుల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ బి. సత్యబాబు, హిందూ కాలేజీ ఆఫ్ మేనేజ్‌మెంటు ప్రిన్సిపాల్ ఎస్వీ రమణ, కరస్పాండెంట్ చెరువు రామకృష్ణమూర్తి, ఆరోగ్య భారతి గుంటూరు జిల్లా అధ్యక్షుడు డాక్టర్ శంకర్‌రెడ్డి, ఆరోగ్య భారతి రాష్ట్ర కమిటీ సభ్యులు డాక్టర్ శ్రీనివాసరెడ్డి, డాక్టర్ కాకాని పృథ్వీరాజ్ ధన్వంతరీ హోమాన్ని పర్యవేక్షించారు. ఇటీవల నిర్వహించిన ఆరోగ్యమిత్ర వర్క్ షాప్‌లో పాల్గొన్న వివిధ పాఠశాలల విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, హిందూ మేనేజ్‌మెంట్ కళాశాల ఎంబీఏ హాస్పిటల్ మేనేజ్‌మెంట్ విద్యార్థులు ఇంటర్న్‌షిప్ సర్టిఫికెట్లు అందించారు.

పెన్షనర్లు, వేతన జీవులకు వెతలు

కొరిటిపాడు(గుంటూరు): వేతన సవరణ సంఘం సిఫార్సులు అమలు, కమిషన్ రిపోర్టు ఇవ్వటంలోనూ ప్రతిసారీ జాప్యం జరగటంతో పెన్షనర్లు, వేతన జీవులకు తీవ్ర నష్టం కలుగుతోందని రాష్ట్ర పెన్షన్‌దారుల చర్చా వేదిక అధ్యక్షులు ఈదర వీరయ్య గురువారం ఒక ప్రకటనలో ఆరోపించారు. వేతన సవరణ సంఘం ఏర్పాటు తర్వాత సిఫార్సుల అమలులో ప్రతిసారీ తీవ్ర జాప్యం జరుగుతుండటంతో ఉద్యోగులు, పెన్షన్‌దారులు తీవ్ర నిరసన వ్యక్తం చేస్తున్నా ఫలితం లేదని తెలిపారు. వాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

మహిళల విద్యాభివృద్ధికి పూలే ఎనలేని కృషి



పూలే విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న మాజీ మంత్రి అంబటి రాంబాబు, నూరిఫాతిమా



పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న కమిషనర్ పులి శ్రీనివాసులు



పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జూపూడి శ్రీనివాసరావు, సంఘాల నాయకులు

వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరి ఫాతిమా

నెహ్రూనగర్: మహిళల విద్యాభివృద్ధికి ఆహర్నిశలు కృషి చేసిన మహానుభావుడు మహాత్మా జ్యోతిరావు పూలే అని వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకర్గ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా పేర్కొన్నారు. పూలే వర్ధంతి పురస్కరించుకుని వైఎస్సార్ సీపీ గుంటూరు జిల్లా అధ్యక్షులు అంబటి రాంబాబు, తూర్పు నియోజకవర్గ నాయకులతో కలిసి ఆమె హిందూ కాలేజీ సెంటర్‌లోని పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జ్యోతిరావు పూలే సంఘ సంస్కర్తగా ఎన్నో సంస్కరణలు తీసుకువచ్చారని తెలిపారు. అలాంటి మహనీయుడి అడుగుజాడల్లో ప్రతి ఒక్కరూ నడవాలని సూచించారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి విద్యకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చారన్నారు. నాడు, నేడు, సీబీఎస్ఈ వంటి కార్యక్రమాలతో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చివేశారని తెలిపారు. గత ప్రభుత్వం చదువులకు ఇచ్చిన ప్రాధాన్యత నేటి ప్రస్తుత ప్రభుత్వం కూడా ఇవ్వాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు ఫర్జాన, అజయ్, పూనూరి నాగేశ్వరరావు, అగ్గిపెట్టి రాజు, తుమ్మేటి శ్రీను, మర్రి సత్యనారాయణ, మద్దిరెడ్డి జగన్‌మోహన్‌రెడ్డి, జఫర్ ఖాన్, గుజ్జుల రామకృష్ణారెడ్డి, పసుపులేటి రామయ్య, ఆవుల కోటేశ్వరరావు, కేసరి సుబ్బులు, సుబ్బారెడ్డి, నరకట్ల శ్రీను, యాదాల చిన్న, నందేటి రాజేష్, ఉమా, షరీఫ్, యంగాల శ్రీధర్, మహేష్, హుస్సేన్, అనిల్, చంటి సాంబ, జిలాని, సమద్, సాగర్, శ్రీకాంత్ రెడ్డి, అష్రఫ్ పాల్గొన్నారు.

అణగారిన వర్గాల అభ్యున్నతికి కృషి

అణగారిన వర్గాల అభ్యున్నతికి మహాత్మ జ్యోతిరావు పూలే దంపతులు ఎనలేని కృషి చేశారని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు పేర్కొన్నారు. జ్యోతిరావు పూలే వర్ధంతిని పురస్కరించుకుని హిందూ కాలేజీ సెంటర్‌లోని విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ విద్య ద్వారానే ఉన్నతంగా ఎదగవచ్చనే ఉద్దేశంతో ఆనాడు విద్య కోసం, ముఖ్యంగా మహిళల విద్యకు పూలే అధిక ప్రాధాన్యత ఇచ్చారని కొనియాడారు. ఆయన స్ఫూర్తిని నేటి యువతరం అందిపుచ్చుకోవాలని ఆయన సూచించారు.

బీసీల ఆశాజ్యోతి

బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి మహాత్మ జ్యోతిరావు పూలే అని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రజక జన సేవ సంఘం ప్రధాన కార్యదర్శి జూపూడి శ్రీనివాసరావు పేర్కొన్నారు. పూలే వర్ధంతిని పురస్కరించుకుని గురువారం యానాదీకాలనీలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పూలే తన జీవితాంతం బహుజనుల కోసం పాటుపడ్డారని తెలిపారు. సామాజిక మార్పు కోసం , చదువుల వల్లే జీవితాలు మారతాయని గట్టి దృఢ సంకల్పంతో పేద వర్గాల కోసం పాఠశాలలు స్థాపించిన మహనీయుడు పూలే అని కొనియాడారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు వై. కోటేశ్వరరావు, జీఆర్ భగత్‌సింగ్, పీవీ రమణయ్య, సాంబయ్య, కోటేశ్వరరావు పాల్గొన్నారు.



పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పాగళ్ల ప్రకాష్

అసమానతలు రూపుమాపేందుకు ఎనలేని కృషి

దేశంలో అసమానతలను రూపుమాపి విద్య వ్యాప్తి కోసం కృషి చేసిన మహనీయులు మహాత్మ జ్యోతిరావు పూలే అని భీమ్ భారత్ రాష్ట్ర అధ్యక్షులు పాగళ్ల ప్రకాష్ పేర్కొన్నారు. పూలే వర్ధంతిని పురస్కరించుకుని అరండల్‌పేటలోని సంఘ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు డేనిస్ రాయ్, మాల్యాద్రి, జయసుధ, నల్లపు నీలాంబరం పాల్గొన్నారు.

నూరు శాతం ఇంటింటి సర్వే చేయాలి



కాకుమాను:ఇంటింటి సర్వేను గ్రామ సచివాలయ సిబ్బంది త్వరితగతిన నూరు శాతం పూర్తి చేయాలని డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారిణి(డీఎల్‌డీవో)సుజాత తెలిపారు. మండలంలోని అప్పాపురం,రేటూరు గ్రామ సచివాలయాలను గురువారం ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు.ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ సిబ్బంది సమయ పాలన పాటించి, ప్రతి రోజూ సర్వే చేయాలని ఆదేశించారు.గ్రామంలోని గృహాలు, నివాసితులు, ఓటర్ల గురించి సర్వేలో పూర్తి స్థాయిలో సేకరించాలని సూచించారు. విధి నిర్వహణలో శ్రద్ధ చూపాలని తెలిపారు. ఈవోపీఆర్డీ రవిబాబు,ఆయా గ్రామాల సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

స్వశక్తితో విద్యార్థులంతా ఎదగాలి



గుంటూరు రూరల్: విద్యార్థులు ప్రస్తుత పోటీ ప్రపంచంలో అందివచ్చిన ప్రతి అవకాశాన్ని సద్వినియోగించుకుని, స్వశక్తితో ఎదిగి పరిశ్రమల స్థాపన దిశగా పయనించి పది మందికి ఉపాధి కల్పించాలని గ్రేడ్- 1 మినిస్ట్రీస్ ఆఫ్ ఇండియా ఎంఎస్ఎంఈ అసిస్టెంట్ డైరెక్టర్ కేసీ చౌదరి తెలిపారు. నగర శివారుల్లోని లాం నందున్న చలపతి ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం విద్యార్థులకు కెరీర్ గైడెన్స్, ఎంటర్‌పెన్యూర్‌గా ఏ విధంగా ఎదగాలి అనే అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు నూతన స్కీమ్స్‌ను ఎంఎస్ఎంఈకి అందజేస్తే వారికి కావాల్సిన పెట్టుబడి పొందవచ్చని తెలిపారు. నమ్మకం, పట్టుదల, కష్టపడేతత్వం పెంపొందించుకోవాలని సూచించారు. చిన్న పరిశ్రమలు స్థాపించి పదిమందికి ఉద్యోగాలను అందించవచ్చని, సమాజాభివృద్ధికి దోహదపడవచ్చని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎం. చంద్రశేఖర్, ప్లేస్‌మెంట్ కోఆర్డినేటర్ చందు రవిశంకర్ పాల్గొన్నారు.

యువత చేతుల్లోనే దేశ భవిత



యువ ఉత్సవ్ కార్యక్రమంలో మాట్లాడుతున్న కిట్స్ కళాశాల చైర్మన్ కోయి సుబ్బారావు

ప్రత్తిపాడు: యువత చేతుల్లోనే దేశ భవిత ఉందని కిట్స్ కళాశాల చైర్మన్ కోయి సుబ్బారావు అన్నారు. వట్టిచెరుకూరు మండలం వింజనంపాడులోని కళాశాలలో గురువారం క్రీడలు, యువజన వ్యవహారాల మంత్రిత్వశాఖ, గుంటూరు నెహ్రూ యువ కేంద్ర, కిట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్ సంయుక్త ఆధ్వర్యంలో యువ ఉత్సవ్- 2024 కార్యక్రమాన్ని అట్టహాసంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ కోయి సుబ్బారావు మాట్లాడుతూ యువశక్తిని సక్రమంగా వినియోగిస్తే భారత్ ప్రపంచంలో అగ్రగామిగా నిలుస్తుందని తెలిపారు. యువతలోని నైపుణ్యాలను బయటకు తీసేందుకు యూత్ ఫెస్టివల్స్ ఉపకరిస్తాయని చెప్పారు. నెహ్రూ యువ కేంద్ర జిల్లా అధికారి డి. కిరణ్మయి మాట్లాడుతూ నేటి తరం యువత అన్ని రంగాల్లో పోటీపడాలన్నారు. ప్రిన్సిపాల్ పి. బాబు మాట్లాడుతూ యువత ప్రశ్నించే గుణం అలవరచుకుంటే జీవితంలో ఉన్నత స్థాయికి ఎదుగుతారని తెలిపారు. కిట్స్ కళాశాల సెక్రటరీ కె. శేఖర్ మాట్లాడుతూ యువఉత్సవ్ కార్యక్రమంతో యువతలో దాగున్న ప్రతిభను వెలికితీయవచ్చని తెలిపారు. తొలుత వికసిత భారత్- 2047 అంశంపై యువతకు పెయింటింగ్, రైటింగ్, మొబైల్ ఫోటోగ్రఫీ, ఉపన్యాస, యువ సంవాదంతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలపై పోటీలు నిర్వహించారు. విజేతలకు నగదు బహుమతులు అందించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ కె.హరిబాబు, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ కె.చంద్రారెడ్డి, ఈవెంట్ కో-ఆర్డినేటర్ పి.సరళ, విద్యార్థులు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
(గుంటూరు ఈస్ట్)
90109 57733
Office mail : sakshigntadvt@gmail.com